## కాలం కథలు

### పాపం సర్కారు!

గోదావరి ఎక్స్‌ప్రెస్ అప్పుడే స్టేషన్‌లో ఆగటంతో ప్లాట్‌ఫారాలన్నీ ఒక్కసారిగా రణగొణధ్వనులతో నిండిపోయాయి. 'లెస్ లగేజ్ మోర్ కంఫర్ట్' అని రైల్వే వారు అంటే, 'మోర్ లగేజ్ లెస్ కంఫర్ట్‌నే ఫాలో అయ్యారు ఆ రైలులోంచి దిగుతున్న ప్రయాణీకులు. భేతాళ్లాంటి మూటోకెనులతో, దయ్యాల్లాంటి బెడ్డింగులతో ఎక్కేవాళ్ళని నెట్టుకుంటూ బయటపడే వాళ్ళను చూస్తూ ఉంటే వీరాభిమన్యుడు మాటి మాటికీ గుర్తొస్తాడు.

నిన్న అసలు కలెక్షన్లు లేని టి. సి. గుర్నాథం తన స్టార్ ఈవేళ ఎలా ఉందో పరీక్షించుకుంటూ ఎక్జిట్ దగ్గర నీరసంగా నిలబడ్డాడు. పాసెంజర్లు ఇస్తూన్న టిక్కెట్లు పేలవంగా అందుకుంటున్నాడు. మనిషి అంత డీలా పడటానికి వేరే కంప్లైంట్లు ఏవీ లేవు, కేవలం కలెక్షన్లను గురించిన నీరసం తప్ప! అంతలో ఓ భారీ శాల్తీ రెండు టిక్కెట్లు చేతిలో పెట్టాడు. ఒక్కసారిగా గుర్నాథం కళ్ళలోకి 'హేలీ' కాంతి మొత్తం వచ్చింది.

"ఈ పాపకి టిక్కెట్టే దండీ?"

"అయిదేళ్ళు నిండని వాళ్ళక్కూడా టిక్కెట్టివ్వట్నేంటీ?"

"ఆ అమ్మాయిని పట్టుకుని అయిదేళ్ళు అంటారేమిటి?"

"భలేవారే. ఇప్పుడు బర్త్ సర్టిఫికేట్ ఎక్కణ్ణుంచి తెమ్మంటారు?"

"అయ్ డోంట్ నో. ఫైన్ ట్వంటీ ఫైవ్. అదర్వైజ్ ప్రాసిక్యూషన్."

ఇలా కాసేపు గొడవపడ్డాక తప్పనిసరి పరిస్థితుల్లో సొమ్ము చెల్లించి బయటపడ్డారు భారీ శాల్తీ బృందం. ఉత్సాహంగా మిగిలిన టిక్కెట్లు కలెక్టు చేయసాగాడు గుర్నాథం.

** ** **

జంక్షన్ మహా బిజీగా ఉంది. ట్రాఫిక్‌ని కంట్రోలు చేయడంలో శాయశక్తుల్నీ ప్రదర్శిస్తున్నారు ట్రాఫిక్ పోలీసులు. జేబు బరువుగా ఉండటంతో హుషారుగా వస్తున్నాడు గుర్నాథం.

"మిస్టర్! స్టాప్ దేర్!" ఆ కేకకి ఈ లోకంలోకి వచ్చాడు గుర్నాథం. ఎదురుగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్! ఆనందంలో రాంగ్ సైడ్‌లో వస్తున్నాడు అతగాడు.

"హెడ్ లైట్‌ని హాఫ్ కవర్ చేయలేదు. ఓవర్ స్పీడ్ కమ్ రాంగ్ సైడ్. ట్వంటీ ఫైవ్ కట్టండి."

ఆ మొత్తం కడుతూ ఇన్‌స్పెక్టర్ ముఖంలోకి చూసిన గుర్నాథం ఉలిక్కిపడ్డాడు— ఉదయం పాతిక రూపాయలు పట్టింది ఈయన దగ్గరే!! ★

-భీమవరపు రవిప్రభాకరరావు

స్వాధీనపరుచుకొన్నారు."

విజయవర్మ మాట్లాడలేదు. మెల్లగా సింహకేసరి శవం వద్దకు నడిచాడు. అతని పక్కన కూర్చుని తలను ఒడిలోకి తీసుకొన్నాడు.

"మిత్రమా సింహకేసరీ. నన్ను శాలంకాయన రాజ్యానికి రాజుని చెయ్యాలని తపించిపోయావ్. నా కోసం అనేక కష్టాలు పడ్డావ్. ప్రాణాలను నా కోసం ఎన్నోమార్లు త్యజించటానికి వెనుకాడలేదు. చివరికి నీ కలలు పండే సమయంలో... కానీ, మిత్రమా ఈ క్షణంలో సకల ధర్మాలపై అనగా నేను నీ చెంత ప్రమాణం చేస్తున్నాను. రాజునై రక్తాన్ని నే నాశించను. ధర్మ రక్షణను వ్రతంగా స్వీకరిస్తున్నాను. నేను ఎప్పుడూ శీలవంతుడినైన మనిషిగా ఉండటానికే ప్రయత్నిస్తాను. నా రాజ్యంలోని ప్రతివారినీ ధీరోదాత్తులుగా, శారీరక మానసికారోగ్యవంతులుగా, కర్మణ్యులుగా, కార్యశీలురుగా, వీరులుగా తీర్చిదిద్దుతాను. వీరత్వం రక్తం చిందించటానికి కాదు. ఒక్క రక్తపు బొట్టుకూడా చిందకుండా ఉండటానికే నా వీరులందరినీ, నా సైనికబలాన్నీ ఉపయోగిస్తాను. మిత్రమా! మంచి పాలన కోసం, మంచి పాలకుడి కోసం తపించిన నీకు నేను ఇంతకన్నా ఏం చేయగలను? నన్ను ఆశీర్వదించమని నిన్ను కోరను మిత్రమా ఊర్ధ్వలోకాలంటూ ఉంటే, అక్కడినుంచి చూడగలిగిన శక్తి నీ కుంటే నన్నెప్పుడూ కనిపెట్టి ఉండు. తప్పు మార్గాన నడిస్తే మందలించు. హెచ్చరించు. అవసరమైతే శిక్షించు. ఇదే నిన్ను నేను కోరేది."

మిత్రుడి శిరను ముద్దాడి లేచాడు విజయవర్మ.

"సింహకేసరి శవంతోపాటు మిగతా శవాలన్నింటికీకూడా గౌరవ లాంఛనాలతో రేపు ఉదయం మహారాజుల మయ్యాక మేము స్వయంగా అంత్యసంస్కారాలు చేస్తాం. ఘంటారావానికి ఇంకా కొంత వ్యవధి ఉందనుకొంటాను. అనుకొన్న సమయానికి ఘంటారావం వినబడాలి. ఈలోగా మేము మరొక ధర్మాన్ని నెరవేర్చి వస్తాము. మిత్తవిందన మహాశయులు మాతో వస్తారు."

వారిరువురికీ రెండు అశ్వాలను సిద్ధం చేసి ఇచ్చారు సైనికులు.

"ప్రభూ. నా కంతా అగమ్యగోచరంగా ఉంది."

"అలాగా? అయితే నా వెంట రండి మహాశయా."

విజయవర్మ మిత్తవిందనుడిని ఒక ఎత్తయిన గుట్టపైకి తీసుకెళ్ళాడు.

"అటు చూడండి మహాశయా. నాలుగు వైపులా చూడండి."

చూచి దిగ్భ్రమ చెందాడు మిత్తవిందనుడు. అటు సైన్యం— ఇటు సైన్యం— ఎటు చూసినా సైన్యమే. బారులు తీరిన అశ్వాల మీద ఉన్న సైనికులు కాగడాలను ఊపుతున్నారు.

"చూచారుగా మిత్తవిందనా! ఇప్పుడు నేను ఒక్క సంజ్ఞ చేస్తే చాలు, వేంగీ నగరంలో, శాలంకాయన రాజ్యమంతటా, రాజప్రాసాదంలో రక్తం ఏరులై పారుతుంది. కానీ, నేను రేపు ఎక్కబోయే సింహాసనం రక్తంతో ఈనాడు అపవిత్రం కావటం నా కిష్టం లేదు. అందుకే మీ జ్యోతిషాన్ని నిజం చేయటానికి ఇంత కాలం పట్టింది. ఇప్పుడు మరి కాస్సేపటిలో నాకు ఈ రాజ్య సింహాసనాన్ని ఇవ్వబోతున్నది ఒక నందివర్మ, శాక్యవర్మల వంటి పదిమంది ప్రభువుల సముదాయం కాదు. ప్రజాబలం. ఆ ప్రజలే అసమర్థతను, అరాచకాన్ని కిందికి దించి నేను సమర్థుడినని పట్టం కడుతున్నారు. నేను రేపు ధరించబోయేది రత్నకిరీటం కాదు మిత్తవిందనా. ముళ్ళకిరీటం."

ఇద్దరూ వైజయంతి గృహాన్ని చేరారు. ఇంటి ముందు జనం.

లోపలి కెళ్ళారు. వైజయంతి రక్తపు మడుగులో తేలుతోంది.

"ఏమయింది?"

"ఏముంది? సృష్టి ఆరంభంనుంచి జరుగుతున్న కథే. ఆమె ఎవర్నో ప్రేమించింది. మరెవరికో ఇచ్చి పెళ్ళి జరిపించారు. ఇవాళ ప్రియుడు వచ్చాడట. ఆ విషయాన్ని ఎవరో గిట్టని వాళ్ళు భర్తకు తెలిపారు. అతను వచ్చి 'కులట'అంటూ నిందించి ఆమెను పొడిచాడు. చావుబతుకుల్లో ఉందామె. భర్త పారిపోయాడు."

విజయవర్మ వైజయంతి దగ్గరగా వెళ్ళి నిలబడ్డాడు. అతని కంటినుంచి జారిన కన్నీటిబొట్టు ఆమె నుదుటిపై రాలింది. అమృతమై ఆమెకు కళ్ళు తెరిచే శక్తి నిచ్చింది. ఇద్దరూ కళ్ళతోనే కొన్ని క్షణాలు మాట్లాడుకొన్నారు. ఆమె తృప్తిగా కళ్ళు మూసింది.

"చూశావా మిత్తవిందనా? ప్రేమకు రాజులు విధించే శిక్షలు ఎన్ని విధాలో గ్రహించావా?"

అతని కళ్ళ ముందు కార్తికేయుడు, సూర్యప్రభ, వసంతశ్రీ, ఇంద్రజిత్ ఒక్క క్షణం మెదలి మాయమయ్యారు. అతని కళ్ళు మరింత తడి అయ్యాయి.

ఇద్దరూ ఆ గృహం దాటి బయటి కొచ్చారు. దారి పొడుగునా ఎక్కడ చూసినా సైన్యం. అయినా ఎల్లెడలా ప్రశాంతత!

బౌద్ధాలయాలలో, ఆరామాలలో, చైత్యాలలో ప్రార్థనలు నిర్విఘ్నంగా సాగుతున్నాయి. చిత్రరథస్వామి ఆలయంలో, నృసింహస్వామి ఆలయంలో పూజలు జరుగుతున్నాయ్.

"బుద్ధం శరణం గచ్ఛామి..." ఒక రంటున్నారు.

"ఈశ్వరా నువ్వే శరణు..." మరొక రంటున్నారు.

"ధర్మం శరణం గచ్ఛామి..." ఒకరి ఆరాటం.

"ధర్మోరక్షతి రక్షితః..." మరొకరికి వేదసూక్తి రక్ష.

"సంఘం శరణం గచ్ఛామి..."

మనుష్య సంఘంలో అందరం పరస్పరాశ్రితులమే.

భావం ఏకం—రూపం భేదం—అంతే... ఆ అద్వైతాన్ని ప్రతిపాదిస్తున్నట్లు అన్ని ఆలయాల నుంచీ ఒకేసారి—ఒకేసారి ఒకే నాదం..

"ఓం..."

శంఖారావం... ఘంటారావం.. విజయవర్మ రాజప్రాసాద ముఖద్వారం వద్ద కొచ్చాడు.

"మహారాజా విజయవర్మ ప్రభువుల వారికి జయము జయము."

ఆ జయజయ ధ్వానాల మధ్య అల్లంత దూరంలో తల వంచుకొని నిలబడి ఉన్న రాజమాత మాయాదేవిని, ఆమె పుత్రులను చూశాడు విజయవర్మ.

శాలంకాయన వంశం వారిది. తనది? వంశం ఏదైతేనేం? మానవ వంశం. ధార్మిక కుటుంబం. అతనొక వ్యక్తిని పిలిచి ఏమో చెప్పాడు.

"శ్రీశ్రీశ్రీ విజయ నందివర్మ మహారాజులకు జయము జయము..."

మాయాదేవి కళ్ళెత్తి విజయవర్మ వైపు చూచింది.

విజయవర్మ ప్రశాంతంగా, స్వచ్ఛంగా నవ్వాడు.

ఘంటారావం ఇంకా వినబడుతోంది.

ధర్మం రక్షింపబడే వరకూ వినబడుతూనే ఉంటుంది... ఉండాలి.

(సమాప్తం)